క్లుప్తంగా

చేప పిల్లల పంపిణీ

కాటారం: మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు ఉపాధి కల్పన తోడ్పాటులో భాగంగా మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న చేప పిల్లలను మంగళవారం మండలంలోని పలు సంఘాలకు పంపిణీ చేశారు. మండలంలోని గంగపురి, విలాసాగర్, కొత్తపల్లి, ధన్వాడ, రేగులగూడెం, ఇబ్రహీంపల్లి మత్స్య సహకార సంఘాలకు 5.40లక్షల ఉచిత చేప పిల్లలను అందించినట్లు ఆ శాఖ ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు. కాగా, కాంట్రాక్టర్ నాణ్యత లేని చిన్న రకం చేప పిల్లలను పంపిణీ చేసినట్లు పలు మత్స్య సంఘాల సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయం వద్ద పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను కొంత మంది మత్స్యశాఖ సిబ్బంది, కాంట్రాక్టర్ కుమ్మక్కై ఓ ప్రైవేట్ స్థలం వద్ద ఉంచి సరఫరా చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ బాబు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు, జిల్లా డైరెక్టర్ రాజబాబు, కొండంపేట సహకార సంఘం అధ్యక్షుడు, జిల్లా డైరెక్టర్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత, పలు గ్రామాల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



పలిమెల: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తమాషారెడ్డి గొత్తికోయలకు తెలిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలిమెల గొత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తమాషారెడ్డి గొత్తికోయలతో మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులు ఎవరైనా గూడెంలోకి వచ్చినా, గూడెం నుంచి ఎవరైనా సొంత గ్రామాలకు వెళ్లిపోయిన ఆ సమాచారం పోలీసులకు తప్పకుండా తెలియజేయాలని తెలిపారు. మావోయిస్టులకు ఎవరూ కూడా సహకరించవద్దని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గూడెంలో ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్, టీజీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



కాటారం: వరి పంట సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని మహాదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ సూచించారు. మండలంలోని దేవరాంపల్లిలో కొనసాగుతున్న క్రాప్ బుకింగ్, రైతులు సాగు చేసిన వరి పంటలను మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరి పంట ప్రస్తుత పరిస్థితి, సోకుతున్న రోగాల గూర్చి ఆరా తీశారు. వరిలో ఏదైన రోగ లక్షణాలు గమనించిన వెంటనే రైతులు అధికారులను సంప్రదిస్తే తగిన నివారణ మార్గాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. క్రాప్ బుకింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించారు. ఏడీఏ వెంట ఏఈఓ అస్మా, రైతులు ఉన్నారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: పంచాయతీ సిబ్బంది సొల్లేటి రాములు మృతి గ్రామానికి తీరని లోటని మాజీ ఎంపీటీసీ సంగి రవి అన్నారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది రాములు ఇటీవల మృతి చెందగా మంగళవారం రాములు చిత్రపటానికి పూల మాలలు వేసి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిలో పూర్తిస్థాయిలో కష్టపడ్డ వ్యక్తి రాములు అన్నారు. డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ గ్రామంలో అందరి కుటుంబ సభ్యుడిగా మెలిగేవాడని గుర్తు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మిట్టపల్లి వనమ్మచంద్రయ్య, ఒరంగంటి సదాకర్, బొజ్జపల్లి శంకర్, వాసాల రవిందర్, రాజేశం, శంకరయ్య, వీరస్వామి, తదితరులు ఉన్నారు.

మద్యం స్వాధీనం

కాళేశ్వరం: మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మద్యం రవాణాను అక్కడి అధికారులు కట్టుదిట్టం చేశారు. దీంతో మహదేవపూర్ మండలం కాళేశ్వరం మీదుగా వంతెన గుండా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర సిరొంచ పరిధిలోని జానంపల్లికి చెందిన వెంకన్న అనే వ్యక్తి 18 మద్యం క్వార్టర్లు అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు. కాగా, రూ.31వేలకు పైగా అక్రమ మద్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని వదిలిపెట్టారని సమాచారం.

నకిలీ పట్టాలతో బెంబేలు



నకిలీ పట్టాలు తయారు చేసిన జిరాక్స్ కాపీలపై ఐటీడీఏ అధికారుల పేర్లు



తయారు చేసిన నకిలీ మ్యాప్‌లు

- ఐటీడీఏ, అటవీశాఖ అధికారుల సంతకాలు ఫోర్జరీ

ఏటూరునాగారం: పేదలకు పోడు పట్టాలివ్వాలని అటవీహక్కుల చట్టాన్ని 2006లో అప్పటి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అయితే కొంత కాలంగా భూములు ధరలు ఆకాశాన్ని అంటడంతో కొంత మంది దళారులు నకిలీ పోడు పట్టాలు తయారు చేసి అక్రమంగా బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారు. వాటినే ఆధారంగా చూపించి అసలైన రైతులను సైతం బెదిరిస్తూ భూములు లాక్కోవాలని కుట్ర చేస్తున్నారు. పోడు పట్టాలపై ఐటీడీఏ, ఫారెస్టు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అసలివాటిలాగే అచ్చుగుద్దినట్లు తయారు చేస్తున్నారు. వాటినే చూపించి భూములు లాక్కోవాలని కూడా కుట్రల చేయడంతో రైతుల మధ్యల గొడవలు తారస్థాయికి చేరుకుంటున్నాయి.

ఒకరిపై ఒకరు దాడులు

మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామంలో శివాపురం గ్రామానికి చెందిన ఆరుగురు రైతుల భూములున్నాయి. ఆ భూముల మావేనని కొంత మందిదళారులు నకిలీ పట్టాలు సృష్టించి భూములను లాక్కోవాలని చూస్తున్నారు. దీంతో రెండు రోజుల క్రితం రైతుల మధ్య గొడవలు జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ విషయంపై ఎలాంటి కేసులు నమోదు చేసుకోలేదు.

భూములకు రక్షణ కల్పించాలి



భూములకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్న శివాపురం రైతులు

గత 18 సంవత్సరాల నుంచి 18 ఎకరాల భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని శివాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటాపురం రైతులు వంగపండ్ల రవి, నక్కల రాజు, బండి రాజు, ఉడత కొమురయ్య, బండి మల్లేశ్, కన్నెబోయిన సాంబరాజు మంగళవారం మీడియాకు వెల్లడించారు. తమ భూములను లాక్కోవాలని చూస్తున్నారని, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించారన్నారు. తమ కాంపార్ట్‌మెంట్ నంబర్లమీదనే పట్టాలు సృష్టించినట్లు తెలిపారు. ఇలాంటి దొంగ పట్టాలు తయారు చేసిన దళారులపై కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని రైతులు వాపోతున్నారు.

వలస నిరోధక చట్టాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో వలస నిరోధక చట్టాన్ని అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ భూములను గిరిజనేతరులు కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలస గిరిజనేతరులు రాజకీయ నాయకుల అండదండలతో వలసలు వచ్చి ఆదివాసీ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణ కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుర్స కృష్ణబాబు, తాటి రాంబాబు, కుర్సం శంకర్, రాజు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

వాజేడు: ప్రజలు తమ ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసులకు దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డిలో మంగళవారం గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

గోవిందరావుపేట: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైజీఆర్ కేర్ సంస్థ లింక్ వర్కర్ సంస్థ లింక్ వర్కర్ భూక్య రాములు అన్నారు. మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ అంటూ వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు. ఎయిడ్స్‌పై అరికట్టుటకు అవగాహన మార్గం అని అన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ సెంటర్‌లో ఉచితంగా చేస్తారని తెలిపారు. ఎవరికైన పాజిటివ్ అని తెలిస్తే వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని అన్నారు. హెచ్ఐవీ పేషెంట్లకు జీవితకాలం పెంపొందించుకోవడానికి ఏఆర్‌టీ అనే మందులు అందుబాటులో ఉన్నాయని తెలి పారు. కళాజాత బృందం ఆట, పాటలు, మాటలతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

చేతిపంపు ఏర్పాటు



చేతిపంపు వద్ద మహిళలు

వెంకటాపురం(కె): కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ, వరంగల్ బాలవికాస సంస్థ సంయుక్తంగా మండలంలోని రామచంద్రాపురం, ఇప్పగూడెం, వాడగూడెం గ్రామాలలో మంగళవారం చేతిపంపులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలవికాస కోఆర్డినేటర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం చేతిపంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేతిపంపులు ఏర్పాటు చేసిన కాఫెడ్, బాల వికాస ప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, యానిమేటర్స్ భాస్కర్, పద్మ పాల్గొన్నారు.

పోరాటయోధుడు కొమురం భీమ్



టేకుమట్ల: కొమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చిట్యాలలో..

టేకుమట్ల/చిట్యాల: ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన పోరాట యోధ/డు కొమురం భీమ్ అని పలువురు పేర్కొన్నారు. కొమురం భీం జయంతి వేడుకలను మంగళవారం ఆయా మండల కేంద్రాలలో ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, ఏవైఎస్ మండల అధ్యక్షుడు ఆరకొండ రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జల్–జంగిల్–జమీన్ నినాదాన్ని నినదించి ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహావీరుడు కొమురం భీమ్ అన్నారు. ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మారెపెల్లి కొమురయ్య, మాడుగుల వీరయ్య, నేరేళ్ల రామకృష్ణ, ఓదెలు, కిరణ్, శ్రీకాంత్, శివశంకర్, అశోక్, సదయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 25న భద్రాద్రి కొత్తగూడెం నుంచి తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కోండ్ర ఓదెలు ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణలో ఎస్సీలను విడగొట్టడం అగ్రవర్ణాల కుట్ర అని ఆరోపించారు. వర్గీకరణలో సుప్రీం కోర్టు తీర్పు సరైంది కాదని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బండెల శ్రీనివాస్, నేరేళ్ల రామక్రిష్ణగౌడ్, గందం సారయ్య, రాజీరు, చిన్న రాజయ్య, శ్రావణ్, వారాల రమేష్, మేకల తిరుపతి, రవి, జంగ మధూకర్, నారాయణ, దేవేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



రేగొండ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న తిరుపతి

రేగొండ: ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు పీఆర్సీని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఎలను ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్లుకల్ల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మడతపల్లి, తిరుమలగిరి పాఠశాలలో మండల అధ్యక్షుడు కొక్కొండ అరవింద ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా మంగళవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం నవంబర్ 23న హైదరాబాద్ ఇందిర పార్కు వద్ద నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు రమేశ్, రఘుపతి, విజయ్, నవీన్, దిలీప్, మమత, రాధిక, సాగర్, గిరిధర్ పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు డీఏ, పెండిగ్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యుడు బుర్ర సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ధర్మ గ్రహ దీక్షలో భాగంగా మంగళవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకుంటే దశల వారిగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అలాగే నవంబర్ 23న హైదరాబాద్ ఇందిర పార్కు వద్ద నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కానుగుల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గోపగాని భాస్కర్, గౌరవ అధ్యక్షుడు శ్రీరాం రఘుపతి, నాయకులు మారబోయిన మహేందర్, ఎద్దుల మనోహర్, తోట సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



జితేందర్ సింగ్(ఫైల్)

ములుగు రూరల్: పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మదనపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక జితేందర్‌సింగ్(39) కుటుంబ సభ్యులతో గొడవపడి ఈ నెల 01న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారని చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలి



నూతన గ్రామ కమిటీతో అంజాద్ పాషా

ములుగు రూరల్: ములుగు మండలంలోని బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అంజాద్ పాషా పేర్కొన్నారు. మండలంలోని కాసీందేవ్‌పేటలో సీపీఐ గ్రామ కమిటీ సమావేశం మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజాద్ పాషా హాజరై మాట్లాడారు. మండలంలోని 20 గ్రామాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. అంకన్నగూడెం గ్రామం నుంచి ములుగు వరకు పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని అన్నారు. బొగ్గుల వాగుపైన ఆనకట్ట నిర్మించి సాగు నీరు అందించి రైతన్నలను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కాసీందేవ్‌పేట గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించాలని, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కట్ల నరేష్, సహాయ కార్యదర్శిగా గుంజె శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా గుంజ రమేష్, మొగిళి, సాంబయ్య, అశోక్, రాజు కుమార్, నరేష్, సంపత్ తదితరులను నియమించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వాజేడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి యోషిత అన్నారు. మండల పరిధిలోని కొప్పుసూరు గ్రామంలో మంగళవారం మాతా శిశు సంరక్షణ వైద్యాధికారిని యోషిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి రక్త పోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలు చేశారు. అలాగే బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆమె మట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాచి వడబోసిన నీటిని తాగాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిలువ ఉన్న నీటిని మూడు రోజులకు ఒక సారి మార్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, అనూష, సత్య నాగవేణి, ఛాయా దేవి, శేఖర్, ఆశకార్యకర్తలు ఉన్నారు.

మొబైల్‌ఫోన్ పోతే అధైర్యపడొద్దు



పోగొట్టుకున్న ఫోన్‌లను అప్పగిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: మొబైల్‌ఫోన్ పోతే ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండి వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు వారి మొబైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్ పోయిన, చోరికి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి ఆ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సెల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు.

రోగుల వివరాలు నమోదు చేసుకోవాలి



సర్వే రికార్డులను అందజేస్తున్న వైద్యులు

వాజేడు: మండల పరిధిలోని రోగుల వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని వాజేడు వైద్యులు కొమురం మహేందర్, మధుకర్ తెలిపారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తలతో వైద్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో రోగుల సర్వేను పక్కాగా చేయాలన్నారు. ఈ మేరకు సర్వే రికార్డులను ఆశ కార్యకర్తలకు అందజేశారు. యోషిత, వెంకట రమణ, కోటిరెడ్డి, రాజేశ్వరి ఉన్నారు.

ధర్మయుద్ధం సదస్సుకు తరలిరావాలి



మాట్లాడుతున్న మడిపెల్లి శ్యాంబాబు

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధం సదస్సుకు మాదిగలు తరలిరావాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఎంపెల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మడిపల్లి శ్యాంబాబు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి కమిటీ పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ సదస్సు జయప్రదం చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చిన అర్థగంటలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణలోనే వర్గీకరణ చేస్తామని ప్రకటించారని తెలిపారు. కాని నేటికి చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో గజ్జెల ప్రసాద్, వావిలాల సాంబశివరావు, స్వామి, లక్ష్మణ్, సతీష్, మల్లేష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

టేకుమట్ల: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు వానాకాలంలో ఇవ్వాల్సిన రైతుబంధు ఇప్పటి వరకు ఇవ్వలేదని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కడా గెలిచే అవకాశం లేదని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు సంపూర్ణంగా బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, సీనియర్ నాయకులు బొడ్డు సదానందం, మాజీ వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, మాజీ సర్పంచ్‌లు ఉద్దమారి మహేష్‌యాదవ్, నేరేళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు ఆది రఘు పింగిళి వెంటేశ్వర్‌రెడ్డి, పొన్నం చంద్రయ్య, నేరేళ్ల రామక్రిష్, నిమ్మల స్వామి, లింగారెడ్డి, అక్రం, దాసారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.